

బీజేపీలోకి కేశినేని నాని!

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆంతరంగిక సమావేశాలు

- ఆటోనగర్‌లో శనివారం ఆత్మీయులతో రహస్యంగా భేటీ
- నందిగామ మండలం బిళ్లనపాడులో మనసులో మాట వెల్లడి
- కొద్దికాలంగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో మంతనాలు
- గొల్లపూడి, తిరువూరులో కూడా ఆంతరంగిక సమావేశాలు
- పెళ్లి వేడుకలో జగన్‌ను కలిసినా.. రాజకీయ ప్రస్తావన లేదు
- ఆంతరంగిక సమావేశాల్లో గడ్డరీని ఆకాశానికెత్తుతున్న కేశినేని నాని

నెల రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్న నాని


పురందేశ్వరి


కేశినేని నాని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) రాజకీయ సన్యాసంపై రూటు మార్చారు. వైసీపీలో చేరి ఆ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. గతేడాది జూన్ 10న ఇక మీదట రాజకీయాల్లో కొనసాగబోనని.. వైసీపీకి గుడ్‌బై చెప్పిన కేశినేని శ్రీనివాస్ మళ్లీ తన స్టాండ్‌ను మార్చుకున్నారు. తాజాగా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరితో గత కొంతకాలంగా టచ్‌లో ఉంటున్నారు. దాదాపుగా ఆయన బీజేపీలో చేరటానికి లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. కేశినేని శ్రీనివాస్‌ను బీజేపీలోకి తీసుకువచ్చేందుకు పురందేశ్వరి గట్టి ప్రయత్నాలు చేసినట్టుగా తెలుస్తోంది. పలుమార్లు ఇద్దరూ భేటీ అయినట్టు సమాచారం.

రాజకీయాల్లోకి రీ ఎంట్రీ!

పక్షం రోజులుగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కేశినేని శ్రీనివాస్ రహస్యంగా ఆంతరంగిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన నందిగామ మండలం బిళ్లనపాడులో జరిగిన ఆంతరంగిక సమావేశంలో కేశినేని చేసిన వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో మిగతా 6లో..

ఎవరి పాత్ర ఎంత?

సత్యవర్ధన్ కేసులో లోతుగా పోలీసుల విచారణ

సిద్ధమైన నిందితుల పూర్తి జాబితా ● జైలులో ఐదుగురు.. పరారీలో ఆరుగురు

- దేశ సరిహద్దులు దాటకుండా లుక్ అవుట్ నోటీసు జారీ
- నేడు న్యాయాధికారి ముందుకు సత్యవర్ధన్?

ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసును పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. అతని విషయాన్ని వంశీ అనుచరులకు ఉప్పదించింది ఎవరు? హైదరాబాద్‌లో ఉన్న సత్యవర్ధన్ విజయవాడకు వస్తున్నాడని ఎలా తెలిసింది? కిడ్నాప్ చేయడానికి ఎన్ని నెలల నుంచి ప్రణాళిక రూపొందించారు? ఎవరెవరు ఎంతెంత పాత్ర పోషించారు? అనే వివరాలను రాబడుతున్నారు. ఇప్పటికే నిందితుల జాబితాను సిద్ధం చేశారు. ఐదుగురు జైలులో ఉండగా.. ఆరుగురు పరారీలు ఉన్నారు. వీరి కోసం వేట ముమ్మరం చేశారు. దేశ సరిహద్దులు దాటకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.



విజయవాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్యవర్ధన్ యూటర్న్ తీసుకోవడంతో వంశీ అనుచరుల్లో అవధులు లేని ఆనందం కనిపించింది. తిరిగి అతికొద్ది రోజుల్లోనే సత్యవర్ధన్ అన్నయ్య కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో అనుచరులకు షాక్ తగిలింది. విజయవాడ పోలీసులు వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేసిన తర్వాత ఆయన శిబిరంలోని పక్షులు తలో దిక్కుకు చెదిరిపోయాయి. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులుగా ఉన్నారు. దర్యాప్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ 11 మందిలో ఐదుగురిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిలో కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగారావు ముఖ్యమైన నిందితులుగా పోలీసులు భావిస్తున్నారు. కేసులో ఉన్న 11 మంది ఒక్కో బాధ్యతను నిర్వర్తించినట్టు పోలీసులకు సమాచారం అందింది. జిల్లా సరిహద్దులు దాటేసిన నిందితులు దేశ సరిహద్దులు దాటకుండా పోలీసులు వారిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మైహోం భూజాలో వంశీ నివాసం ఉంటున్న మిగతా 6లో..

కబ్జాలు, దందాలతో గన్నవరాన్ని

నాశనం చేశారు

చేసిన పాపాలకే శిక్ష అనుభవిస్తున్నారు..
మేం కక్ష సాధించటం లేదు



- భూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారు.. వాటిపై విచారణను కోరుతున్నా
- ఎమ్మెల్యే కాగానే గ్రీవెన్స్ నిర్వహిస్తే 5 వేల మంది వచ్చారు
- అన్నీ భూ కబ్జా కేసులే.. వీటిలో కొన్నింటిని విచారించాం
- నాపై ట్వీట్లు చేసే వైసీపీ నేతలు కలుగులో కాకుండా బయటకు వచ్చి మాట్లాడాలి
- 'ఆంధ్రజ్యోతి'తో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

6

'వంశీ అరెస్టు సక్రమమే. మహానుభావులు గెలిచిన గన్నవరం గడ్డ మీద కబ్జాలు, దందాలు, అక్రమాలు చేశారు. ఎందరి మీదో అక్రమ కేసులు బనాయించారు. చేసిన పాపాలకే ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వంశీపై జగన్, ఇతర నేతలు మొసలి కన్నీరు కారుస్తూ ట్వీట్లు పెట్టడం కాదు. దమ్ముంటే బయటకు వచ్చి మగాళ్లలా మాట్లాడాలి. వంశీని నేనెప్పుడూ రాజకీయ ప్రత్యర్థిగానే చూశా. కక్ష పూరితంగా చూడలేదు. ఆయన నన్ను శత్రువుగానే చూశాడు. ఐదేళ్లు వాళ్లు విధ్వంసం చేస్తే నేను అభివృద్ధి చేస్తున్నా' అని గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. వంశీ అరెస్టు నేపథ్యంలో యార్లగడ్డ వెంకట్రావుపై వైసీపీ మూకలు సోషల్ మీడియా వేదికగా దాడి చేస్తున్న నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆయన మాటల్లోనే ..

'ఆర్‌డబ్ల్యూఎస్'లో కాంట్రాక్టర్ల పెత్తనం

ఈఈ కార్యాలయం ఉద్యోగులతో దురుసు ప్రవర్తన

మా బిల్లులు ఎందుకు రెడీ చేయడంలేదని ఆగ్రహం

జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ కార్యాలయంలో కాంట్రాక్టర్ల పెత్తనం పెరిగిపోయింది. మా పనుల బిల్లులు ఎందుకు చేయడం లేదంటూ ఉద్యోగుల వద్దకు నేరుగా వచ్చి దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈఈ కార్యాలయం అధికారి ఎదురుగా కూర్చుని మరీ ఉద్యోగులను పిలిచి నిలబెట్టి అనధికార పెత్తనం చలాయిస్తున్నారు. కాంట్రాక్టర్ల తీరుతో మహిళా ఉద్యోగులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. కంప్యూటర్ ఒక్కటే ఉండటంతో ఒకరి తర్వాత ఒకరం పనులు చేసుకోవాల్సి వస్తుందని చెబుతున్నా వినిపించుకోకుండా కాంట్రాక్టర్లతో కలిసి ఈఈ ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.

- మనస్తాపానికి గురవుతున్న మహిళా ఉద్యోగులు
- కంప్యూటర్ ఒక్కటే ఉండటంతో ఆలస్యమవుతున్న పనులు
- ఉద్యోగులపై కలెక్టర్‌కు కాంట్రాక్టర్లతో కలిసి ఇన్‌చార్జి ఈఈ ఫిర్యాదు


గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఈ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ కార్యాలయాన్ని గుడివాడ నుంచి ఇటీవల మచిలీపట్నం మార్చారు. నోబుల్ కళాశాలకు ఎదురుగా ఉన్న బందరు సోడా, కిళ్లీ, బీడీ వర్తక సంఘం భవనంలో ఈ కార్యాలయాన్ని కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయంలో ఈఈగా ఎవరూ లేకపోవటంతో డీఈ స్థాయి అధికారినే ఇన్‌చార్జిగా కొనసాగిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులు పనిచేసేందుకు కంప్యూటర్లు, సరిపడా గదులు లేవు. కార్యాలయంలో ఉన్న ఒకే కంప్యూటర్‌ను ఐదు విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉపయోగించుకోవాల్సి వస్తుంది. కార్యాలయానికి సంబంధించిన బిల్లులు, ఇతరత్రా పరిపాలనా పరమైన అంశాలకు సంబంధించిన పనులు చేయాలంటే ఒకరు పనిచేస్తుంటే మిగిలినవారు కంప్యూటర్ ఎప్పుడు ఖాళీ అవుతుందా అని ఎదురుచూడాల్సిన దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో వివిధ పనులపై కాంట్రాక్టర్లు కార్యాలయానికి వచ్చి మా పనులు ఎందుకు పూర్తికాలేదని ఉద్యోగులపై విరుచుకుపడుతున్నారు. రాత్రి మీకు ఫోన్ చేస్తే ఎందుకు సమాధానం చెప్పలేదంటూ దురుసుగా మాట్లాడుతున్నారు. దీంతో మహిళా ఉద్యోగులు ఏం మాట్లాడలేక, తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుంగిపోతున్నారు.

పనిచేయడంలేదని కలెక్టర్ వద్ద పంచాయితీ!

ఇటీవల కాలంలో రెండు సార్లు కలెక్టర్ చాంబరుకు ఇన్‌చార్జి ఈఈ తమను తీసుకువెళ్లారని ఉద్యోగులు చెబుతున్నారు. సక్రమంగా పనిచేయాలని కలెక్టర్ మొదటిసారి చెప్పారన్నారు. ఆ సందర్భంలో కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తామంతా కలెక్టర్‌కు విన్నవించామని ఉద్యోగులు తెలిపారు. అయినా రెండోసారి అకారణంగా తమను మళ్లీ కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారని, మా పరిస్థితిని అర్థం చేసుకున్న కలెక్టర్ ఏం మాట్లాడలేదన్నారు. కాంట్రాక్టర్లు ఇన్‌చార్జి ఈఈ ఎదుటనే తమపట్ల దురుసుగా మాట్లాడుతుంటే వారించాల్సింది పోయి మా పనితీరు బాగోలేదని రెండు మార్లు కలెక్టర్ వద్దకు మమ్ములను తీసుకువెళ్లారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

ఇటీవల జరిగిన బదిలీల్లో పెద్దవయసున్న మహిళా ఉద్యోగి ఒకరు ఈఈ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఆమె అనారోగ్య కారణాలతో కొంతమేర పనిచేయడంలో వెనుకబడుతున్నారు. దీంతో ఆమెకు తరచూ మెమోలు జారీ చేయడం, సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని సమాచారం. అనారోగ్య కారణాలను దృష్టిలో పెట్టుకుని సదరు మహిళా ఉద్యోగిని ఈఈ కార్యాలయం నుంచి వేరే కార్యాలయానికి బదిలీ చేసి, వేరే ఉద్యోగిని ఇక్కడ నియమించుకునే అవకాశం ఉంది. అయినా ఆ దిశగా చర్యలు తీసుకోకుండా ఈ మహిళా ఉద్యోగిని వేధించడంపై కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పనిచేసేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నీచర్ తదితర వసతులు సమకూరిస్తే పనులు త్వరితగతిన పూర్తిచేస్తామని ఉద్యోగులు అంటున్నారు. ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం, కాంట్రాక్టర్ ఉద్యోగులను దూషించడాన్ని ఇకపై సహించబోమని, ఈ అంశంపై మూకుమ్మడిగా ఆందోళనకు దిగుతామని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

తగ్గేదే లే..

వైసీపీ కబ్జా గ్యాంగ్ తీరు ఇది

- కబ్జా స్థలంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అధికారులను భయపెట్టే ప్రయత్నం
- కార్పొరేషన్ స్థలం కోర్టు వివాద స్థలంగా చిత్రీకరణ
- ఫ్లెక్సీలను తొలగించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- స్థలాలు కొని మోసపోయిన బాధితుల ఆందోళన
- కబ్జా గ్యాంగ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకోలు



కబ్జా గ్యాంగ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది


కబ్జా స్థలం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

నగర శివారుల్లోని పాయకాపురం కండ్రిక కాలనీ సరిహద్దులో కార్పొరేషన్ స్థలాన్ని కబ్జా చేసిన వైసీపీ కబ్జా గ్యాంగ్ తగ్గేదే లే.. అంటోంది. కబ్జా వ్యవహారంపై అధికారులు చర్యలు చేపట్టకుండా ముందస్తుగానే కబ్జా చేసిన కార్పొరేషన్ స్థలాన్ని కోర్టు వివాదంలో ఉన్న ప్రైవేట్ స్థలం వ్యవహారంగా చిత్రీకరించింది. అంతటితో ఆగకుండా అధికారులను భయపెట్టే విధంగా కబ్జా స్థలంలో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసి అధికారులు ప్రభుత్వ భూమిలో అడుగు పెట్టకుండా ఉండాలని కుయుక్తులు పన్నింది. అయితే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కబ్జా స్థలం వద్దకు వచ్చి ఆదివారం ఫ్లెక్సీలను తొలగించివేశారు. అదే సమయంలో కబ్జా గ్యాంగ్ వద్ద స్థలాలు కొని మోసపోయిన బాధితులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు.

పాయకాపురం/విజయవాడ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కండ్రిక కాలనీ సమీపంలోని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌కు ఆనుకుని ఉన్న కార్పొరేషన్‌కు చెందిన రూ.10 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైన విషయమై ఆదివారం 'కబ్జా గ్యాంగ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారుల కన్నా ముందే కబ్జా గ్యాంగ్ స్పందించింది. తెల్లవారు జామునే కబ్జా స్థలంలోకి చేరుకుని సదరు స్థలం కోర్టు వ్యవహారమని ఇతరులు ఎవరు స్థల వివాదంలో జోక్యం చేసుకోరాదంటూ పదుల సంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఫ్లెక్సీలను చూసి కంగారు పడ్డారు. కోర్టు వ్యవహారంలో ఉన్న ప్రైవేట్ స్థలంగా కాసేపు భ్రమలో పడిపోయారు. అయితే పైఅధికారులను సంప్రదించగా అది కార్పొరేషన్‌కు చెందిన స్థలంగా నిర్ధారించుకుని అనంతరం యాక్షన్‌లోకి దిగిపోయారు. కబ్జా భూముల్లో ఏర్పటు చేసిన ఫ్లెక్సీలను మొత్తం పూర్తిగా తొలగించారు.

సరిహద్దు రాళ్లను తొలగిస్తాం : బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

కార్పొరేషన్ భూమి కబ్జా విషయమై బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత స్పందించారు. ఆదివారం ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగింపజేసిన ఆమె సదరు స్థలం కార్పొరేషన్ స్థలంగా ధ్రువీకరించారు. అలాగే ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను సోమవారం తొలగించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్సీ అనుచరుడే కీలకం

కబ్జా వ్యవహారంలో ఎమ్మెల్సీ అనుచరుడు, వైసీపీ సానుభూతిపరుడు బండారు దుర్గారావు కీలకంగా వ్యవహరించినట్లు బయటపడింది. ఆదివారం రోడ్డెక్కిన బాధితులు బండారు దుర్గారావు తమకు సిమెంట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ స్థలంగా నమ్మబలికి అమ్మినట్లు బాధితులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2021లోనే కార్పొరేషన్ స్థలాన్ని కబ్జా చేసి 36 ప్లాట్లుగా విడగొట్టి నకిలీ పత్రాలు సృష్టించినట్లు తేలింది. మొత్తం రూ.10 కోట్లు విలువ చేసే 4000 గజాల స్థలానికి పక్కనే ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ సర్వే నంబరు డాక్యుమెంట్ల ద్వారా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు స్పష్టమవుతుంది.

బాధితుల ఆందోళన

కార్పొరేషన్ స్థలాన్ని సిమెంట్ ఫ్యాక్టరీ అసోసియేషన్‌కు చెందిన స్థలంగా భావించి స్థలాలు కొనుగోలు చేసి కబ్జా గ్యాంగ్ చేతుల్లో మోసపోయిన బాధితులు ఆదివారం రోడ్డెక్కారు. కబ్జా భూముల వద్దకు చేరుకుని తాము మోసపోయామంటూ గగ్గోలు పెట్టారు. తమను నమ్మించి నట్టేట ముంచేశారని, తాము దాచుకున్న డబ్బుతో కొన్న స్థలాలు ప్రభుత్వ స్థలాలని తెలియడంతో వారంతా బోరుమంటున్నారు. రెండేళ్ల కిందటే తక్కువ ధరలకు వస్తున్నాయని స్థలాలు కొన్నామని ఇలా మోసపోతామని గ్రహించలేకపోయామని, తమకు స్థలం అమ్మిన వ్యక్తులపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

రేపు శిడిబండి వేడుక


6లో

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన


క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు
6లో

చికెన్ షాపులు వెలవెల

బర్డ్ ఫ్లూతో నిలిచిపోయిన కోడిమాంసం, గుడ్ల అమ్మకాలు

- ధర తగ్గించినా అటువైపు చూడని వినియోగదారులు
- కిటకిటలాడిన చేపల దుకాణాలు


జి.కొండూరులో చికెన్ దుకాణాలు

(ఇబ్రహీంపట్నం /జీ కొండూరు, ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ దెబ్బకు చికెన్, కోడిగుడ్లు కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. ధర తగ్గించి పెట్టినా ఆ వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం మండలం అనుముల్లంకలో బర్డ్ ఫ్లూ సోకి సుమారు 15 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ కోళ్ల నుంచి తీసిన శాంపిల్స్‌ను రోగ నిర్ధారణకు పశు సంవర్ధకశాఖ అధికారులు భోపాల్‌కు పంపారు. 10 కిలో మీటర్ల వరకు రెడ్ జోన్‌గా ప్రకటించి చికెన్ అమ్మకాలను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య 12 సరిహద్దు బోర్డర్లలో 36 మంది సిబ్బందికి డ్యూటీలు వేసి కోళ్ల రవాణా జరగకుండా చర్యలు చేపట్టారు. రోగ నిర్ధారణ అయ్యే వరకు చికెన్, కోడి గుడ్లు తినకుండా ఉంటే మంచిదని ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలోని 116 కోళ్ల ఫారాల్లోని కోళ్ల నుంచి ఏడాదికి 5,592 టన్నుల కోడి మాంసం ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన రూ.55.92 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అలాగే కోడి గుడ్ల నుంచి రూ.206.95 కోట్లకు పైగా వ్యాపారం సాగుతోంది. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ దెబ్బకు అందులో 10వ వంతు వ్యాపారం కూడా నేడు సాగడం లేదు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ పరీక్షలు ఆలస్యం అయితే జిల్లాలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ మరింత కుదేల్ అయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. కాగా, చేపల దుకాణాలు కొనుగోలుదారులతో ఆదివారం కళకళలాడాయి. బారులుతీరి మరీ చేపలు కొనుగోలు చేశారు.

విధ్వంసం నుంచి స్వేచ్ఛ దిశగా..

- మండలి ఎన్నికల్లో చారిత్రాత్మక మెజారిటీ సాధిద్దాం
- చట్టం నుంచి నానీలు తప్పించుకోలేరు
- మంత్రి కొల్లు రవీంద్ర

6లో

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు



వీరమ్మ ఆలయం వద్ద జనసంద్రంలా భక్తులు, అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు వెళుతున్న పారుపూడి వంశస్థులు



ఉయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో చివరి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు లక్షకుపైగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి అర్ధరాత్రివరకు ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ప్రాంగణం, పట్టణ రహదారులు కిక్కిరిసి జనసంద్రంలా మారాయి. ఉమ్మడి, పొరుగు జిల్లాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పాలపొంగళ్లు తయారుచేసి పసుపు కుంకుమ, చీర సారె సమర్పించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

వీరమ్మ శిడిబండి వేడుక రేపు

వీరమ్మ తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న శిడిబండి వేడుకు మంగళవారం సాయంత్రం నిర్వహించనున్నారు. తిరునాళ్లలో 11వ రోజు అత్యంత వైభవంగా జరిగే శిడిబండి వేడుక తిలకించేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఓదళిత కుటుంబానికి చెందిన వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడి (పెళ్లికొడుకు)ని శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చుండబెట్టి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊయల స్తంభాలు, ఆలయ ప్రదక్షిణ చేసి, అమ్మవారి దర్శనం చేయిస్తారు. ఏవిధమైన అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసారు.

దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో
సంకట హర గణేశుడికి అర్చన



భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిథి సందర్భంగా ఆదివారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. భక్తుల సుఖశాంతులు కోరుతూ వారి ఈతి బాధలను నివారించాలని సంకల్పిస్తూ పూజాధికాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు గణేశుడికి పూజలు చేశారు.

● మాఘమాసం, ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలలో భక్తులను నియంత్రించారు. క్యూలైన్లలో పరిస్థితిని, భక్తుల రాకపోకలను తగు సూచనలు చేసి క్రమబద్ధీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయండి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎన్ఐఆర్డీలో శిక్షణ పూర్తిచేసుకున్న 33 మంది పంచాయతీ చాంపియన్లతో ఆదివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఇటీవల కేశినేని ఫౌండేషన్ సహకారంతో శిక్షణ పొందిన 33 మందితో హైదరాబాద్‌లో సమావేశమైన ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరువ కావాలన్నారు. ప్రధాని మోదీ ఆశయం వికసిత్ భారత్, ప్రతి కుటుంబంలోను ఒక ఎంటర్ ప్రెన్యూర్ అన్న ఏపీ సీఎం చంద్రబాబు లక్ష్యం నెరవేరాలంటే పంచాయతీ చాంపియన్లే లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. ఈ నెల 10 నుంచి 16 వరకు శిక్షణ పొందిన యువకులకు ఎన్ఐఆర్డీపీఆర్ డైరెక్టర్ జనరల్ బి.నరేంద్ర కుమార్‌తో కలిసి ఎంపీ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు తమ గ్రామాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నారన్న దానిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని 295 గ్రామాలలో జరిగే అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలబడాలన్నారు. నాలుగు నియోజకవర్గాలలో శానిటరి నాపికిన్స్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి తక్కువ ధరకు విక్రయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధుల పైనే ఆధారపడకుండా సిఎస్ఆర్ నిధుల ద్వారా కృషి చేయాలన్నారు. సీనియర్ కన్సల్టెంట్ మహమ్మద్ ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ రంజన్ కుమార్ బాంజా, అసోసియేట్ ప్రొఫెసర్ సి.కపిరాజన్, ప్రాజెక్టు టీమ్ లీడర్ దిలీప్ కుమార్ పాల్, అసోసియేట్ ప్రొఫెసర్లు ఆర్.రమేష్, పార్థ ప్రతీన్ సాహు, అనురాధ పల్లా, ఎన్ఐఆర్డి అధికారి మురళీకృష్ణ, ప్రోగ్రామ్ సమన్వయకర్తలు కొంగా సంజయవర్మ, జి.వి.నరసింహారావు పాల్గొన్నారు.

16రాము14 : మాట్లాడుతున్న కేశన శంకర్రావు

జనగణనతో పాటే కులగణన జరపాలి



» కేసన శంకర్‌రావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కేటాయించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా ఈసారి చేపట్టే జనగణనతోపాటే కులగణన చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు అన్నారు. ఆదివారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన ఎన్టీఆర్ జిల్లా నాయకులతో జలగణనలో సమగ్ర కులగణన అంశంపై సమావేశం నిర్వహించి పలు అంశాలను తీర్మానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జనగణనతో పాటు సమగ్ర కులగణన ఒక్కటే పరిష్కార మార్గమని తెలిపారు. గతంలో మోదీతో పాటు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్‌లు దేశంలోని ప్రతి ఒక్కరినీ కులాలతో సహా లెక్కిస్తామని వాగ్దానం చేసి ఇప్పుడు తాత్సారం చేయటం తగదన్నారు. అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న ఓబీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టంలో బీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేయాలన్నా కులగణన చేయటం అవసరమన్నారు. దీనిపై త్వరలో విజయవాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు.



10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, మడకా సత్యఆదిత్య ప్రసాద్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న డా.కెకెఆర్స్ గౌతమ్ డైరెక్టర్ అవినాశ్

క్రీడలతో ఉజ్వల భవితకు పునాది

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో స్టేడియం రూపకర్త కీ.శే పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ 10కే రన్ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే వెనిగండ్ల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి స్టేడియం కమిటీ చేస్తున్న కృషిలో భాగంగా ప్రతి ఏడాది 10కె రన్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడాకారులు పట్టుదలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఐఎంఏ నాయకులు మాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ మడకా ప్రసాద్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మడకా మనుమడికి ప్రత్యేక బహుమతి

స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10కే రన్ పోటీల్లో అంతర్జాతీయ రిఫరీ మడకా ప్రసాద్ మనుమడు మడకా సత్యఆదిత్య ప్రసాద్ 4కె రన్‌ను పూర్తి చేశాడు. అతితక్కువ వయస్సులో 4కె రన్ పూర్తి చేసిన మడకాకు డా.కెకెఆర్స్‌గౌతమ్ పాఠశాల డైరెక్టర్ కె.అవినాశ్ చేతులమీదగా ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని అందజేశారు.

విధ్వంసం నుంచి స్వేచ్ఛ దిశగా..

మండలి ఎన్నికల్లో చారిత్రాత్మక మెజారిటీ సాధిద్దాం » చట్టం నుంచి నానీలు తప్పించుకోలేరు : మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో మంత్రి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శాసనమండలి సమావేశంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చారిత్రాత్మక మెజారిటీ సాధించి తీరుతారని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా టీడీపీ కార్యాలయంలో శాసన మండలి ఎన్నికలపై మంత్రులు, శాసనసభ్యులు, కూటమి నాయకులతో విస్తృత సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, ప్రతి గ్రాడ్యుయేట్‌ను కలిసి అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసేలా ఒప్పించాలన్నారు. ఐదేళ్లపాటు అణచివేత ధోరణిలో ఉన్న రాష్ట్రానికి మళ్లీ పోలవరం, అమరావతి రాజధాని వస్తున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల ప్రాజెక్టుగా మార్చేసిందని, కేంద్ర ప్రభుత్వ సాయంతో ఆ పథకానికి జవసత్వాలు వచ్చాయన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు రెండు లక్షల కోట్ల పెట్టుబడులు అందించి శంకుస్థాపనలు చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాన్ని.. కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను యువతకు వివరించాలన్నారు. ఖర్మ ఫలం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, వంశీకి ఏ విధమైన పరిస్థితి వచ్చిందో అదే విధంగా గుడివాడ గుట్కా రాయుడు, బందరు బియ్యం దొంగలు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, సమన్వయంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో శాసనసభ్యులతో పాటు నాయకులు, కార్యకర్తలు మెజారిటీపై దృష్టి సారించాలన్నారు. గత ప్రభుత్వం టీచర్లను ఎలా ఇబ్బంది పెట్టిందో గుర్తుచేయాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ప్రతి 30 మంది ఓటర్లకు ఒక కూటమి నాయకుడు పనిచేయాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.వెంకటకోటేశ్వరరావు మాట్లాడుతూ, కొందరు టీచర్లు పీఆర్సీ, డీఏలపై ఆశలు పెట్టుకున్నారని, త్వరలో వాటిని కూటమి ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. సమావేశంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బయోడస్ట్ చైర్మన్ విజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్, మండలి రాజా, కొనకళ్ల జగన్నాథరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, బీజేపీ నాయకుడు పుప్పాల రామాంజనేయులు, కొండలరావు, గొట్టిపాటి రామకృష్ణ, శంకరబాబు, గోపు సత్యనారాయణ, బత్తిన దాసు, కుంచే నాని, స్వర్ణలత, పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి పాత్ర ఎంత?

(5వ పేజీ తరువాయి)

ఎఫ్ బ్లాక్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన విజయవాడ పోలీసులు వాటిని తీసుకుని వచ్చారు. ఆ ఫుటేజీలను సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషించిన తర్వాత కోర్టులో సాక్ష్యాధారంగా సమర్పించాలని భావిస్తున్నారు.

ఇదీ నిందితుల జాబితా

ముదునూరి సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో ఉన్న 11 మంది నిందితుల పేర్లు మొత్తం బయటకు వచ్చాయి. సత్యవర్ధన్ అన్నయ్య కిరణ్ ఫిర్యాదుతో పటమట పోలీసులు క్రైం నంబరు 86/2025తో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో వల్లభనేని వంశీమోహన్ (ఏ1), కొమ్మా కోట్లు (ఏ2), భీమవరపు రామకృష్ణ (ఏ3), ఘంటా వీర్రాజు (ఏ4), ఓలుపల్లి మోహనరంగారావు (ఏ5), వజ్రేశ్వరరావు (ఏ6), ఏలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్ (ఏ7), నిమ్మ లక్ష్మీపతి (ఏ8), పొట్టి రాము (ఏ9), వేలూరి వంశీబాబు (ఏ10), చేబ్రోలు శ్రీను (ఏ11) నిందితులుగా ఉన్నారు. వారిలో వంశీ, ఘంటా వీర్రాజు, శివరామకృష్ణప్రసాద్, లక్ష్మీపతి, వంశీబాబును పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిందితుల్లో వంశీ ప్రధాన అనుచరులు కొమ్మా కోట్లు, ఓలుపల్లి మోహనరంగావుకు మొత్తం ప్రణాళిక తెలుసని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. వారిద్దరూ ఎక్కడున్నా సంకెళ్లు వేయాలని భావిస్తున్నారు. వారి కోసం ఒక ప్రత్యేక బృందం పనిచేస్తోంది. కాగా, సోమవారం న్యాయాధికారి ముందు సత్యవర్ధన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం.

బీజేపీలోకి కేశినేని నాని!

(5వ పేజీ తరువాయి)

ఆయన రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు చాలా స్పష్టంగా చెప్పారు. విజయవాడ నగరం అంటే తనకు పిచ్చి మమకారమని, తనను ప్రజా సేవ చేసేందుకు రెండు సార్లు ఇక్కడి ప్రజలు తనకు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. తానెప్పుడూ స్వార్థం లేకుండా పనిచేశానని, తన ఎంపీ పదవిని ఎప్పుడూ కూడా తన స్వార్థ ప్రయోజనాలకు వాడుకోలేదని తెలిపారు.

బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పరిచయాలు

తనకు రతన్ టాటాతో పాటు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్ఫూర్తిదాయకులని నాని చెప్పుకొచ్చారు. టాటా ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో ఎవరూ చేయని సేవలు చేశానని చెప్పారు. గడ్కరీతో ఉన్న పరిచయం కారణంగా విజయవాడ నగర అభివృద్ధికి ఎన్నో ప్రాజెక్టులను తీసుకువచ్చానని తెలిపారు. బీక్షనపాడు తర్వాత గొల్లపూడి, తిరువూరులో కూడా రహస్యంగా కేశినేని శ్రీనివాస్ ఆంతరంగిక సమావేశాలు నిర్వహించారు. అలాగే శనివారం ఆటోనగర్‌లో కూడా తన ఆత్మీయులతో రహస్యంగా భేటీ అయ్యారు. గడ్కరీతో ఉన్న పరిచయాలు, ఎన్డీఏ ప్రభుత్వంతో ఉన్న సత్సంబంధాలు కేశినేని శ్రీనివాస్‌ను ఆ పార్టీ వైపు అడుగులు వేసేలా పురిగొల్పాయని తెలుస్తోంది.

టీడీపీలోకి వెళ్లే అవకాశం లేదు!

టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం లేదు. వైసీపీకి పూర్తిగా గుడ్‌బై చెప్పారు. ఇటీవల బెంగళూరులోని ఓ వివాహ ఫంక్షన్‌లో వైసీపీ అధినేత జగన్‌ను కేశినేని నాని ఆయన కుటుంబ సభ్యులు కలిశారు. సరదాగా మాట్లాడుకున్నారే తప్ప ఇద్దరి మధ్య రాజకీయాల ప్రస్తావన కూడా రాలేదని తెలిసింది. వైసీపీకి గుడ్‌బై చెప్పిన తర్వాత తిరిగి ఆ పార్టీలోకి వెళ్లటం కేశినేని నానికి కూడా ఇష్టం లేదని తెలుస్తోంది. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కేశినేని శ్రీనివాస్‌ను బీజేపీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు చేయడంతో ఆయన మనసు మార్చుకున్నట్టు సమాచారం. కేశినేని శ్రీనివాస్ తన నిర్ణయాన్ని మరో నెల రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

కబ్జాలు, దందాలతో గన్నవరాన్ని నాశనం చేశారు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: కుప్పలు తెప్పలుగా భూకబ్జాలపై అర్జీలు.. నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తే ఐదువేల మంది వచ్చారు. ఎక్కువగా భూ కబ్జాల పైనే ఫిర్యాదులు వచ్చాయి. కొన్నిటిపై విచారణ కూడా జరిగింది. నూరుశాతం భూ కబ్జాలకు పాల్పడ్డారు. మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు మండలాలకు నరసింహారావు అనే తహసీల్దార్‌ను ఒక్కడినే పెట్టి ఇష్టానుసారంగా భూ రికార్డులను ట్యాంపరింగ్ చేశారు. జగనన్న ఇళ్ల పట్టాల కోసం భూములను సేకరించే విషయంలో అంతులేని అక్రమాలకు పాల్పడ్డారు. అప్పటి తహసీల్దార్, జేసీ మీద కూడా విచారణ జరిపితే భూకబ్జాల బాగోతం వెలుగులోకి వస్తుంది. ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో కూడా కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. వాటిపైనా విచారణ జరుగుతోంది.

పరిశ్రమలను తన్ని తరిమేశారు

టీడీపీ ప్రభుత్వంలో మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ ఏర్పాటు చేశారు. దానిని వారు పట్టించుకోకుండా తన్ని తరిమేశారు. నేను ఎన్నికల ముందు అశోక్ లేల్యాండ్‌ను తిరిగి తీసుకువస్తానని చెప్పా. అన్నట్టుగానే మళ్లీ పునః ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నా. మల్లవల్లిలో భూముల ధరలను భారీగా పెంచేశారు. ఎంఎస్ఎంఈలు ఎన్నింటినో సాగనంపారు. పరిశ్రమలు అనేవి లేకుండా పోయాయి. మల్లవల్లిలో పరిశ్రమలను తీసుకువచ్చే పని చేపడుతున్నా. సుప్రీం సొల్యూషన్స్ అనే పెద్ద సంస్థ త్వరలో వస్తోంది. మరో 479 ఎకరాలతో మల్లవల్లి విస్తరణ ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 5 వేల నుంచి 15 వేల మంది ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నాం.

కామన్ సైట్లను కబ్జా చేశారు

నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా చేశారు. వెంచర్లలో కామన్ సైట్లు లాగేసుకుని అమ్ముకున్నారు. ఎంతో మంది చేతులు మారిపోయాయి. విజయవాడ రూరల్ మండలంలో అయితే కామన్ సైట్లు లేకుండా పోయాయి.

కొండలను కరిగించేశారు

నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ తారాస్థాయిలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు అక్రమ క్వారీయింగ్‌పై విజిలెన్స్ విచారణ జరిపించారు. విచారణలో ఎన్నో అంశాలు నిగ్గు తేలాయి. వాటిలో కొందరి పేర్లు బయటకు వచ్చాయి. మరికొందరు పేర్లు బయటకు రాలేదు. పూర్తి డేటా ప్రభుత్వం దగ్గర ఉంది. అక్రమాలకు పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయి. అలాగే భూ కబ్జాలు, భూ రికార్డుల ట్యాంపరింగ్ వంటి వాటిపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

అక్రమ కేసులు ఇష్టానుసారం పెట్టారు..

ఐదేళ్లలో ఆయన సొంత పార్టీ నేతలతో పాటు, మా పార్టీ నేతలపై కూడా ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నిక అయిన తర్వాత అక్రమ కేసులు ఎవరి మీద పెట్టనని చెప్పా. నా మాటకు కట్టుబడి ఉన్నా. వైసీపీ నాయకులు ఒక్కరిపై కూడా నేను అక్రమ కేసు పెట్టలేదు. వంశీ హయాంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టారో అందరికీ తెలుసు.

అధికారం పోయినా దందాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా దందాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన కాంట్రాక్టు పనులను వంశీ అనుచరులు కడియాల సతీష్, రఘు దక్కించుకున్నారు. భారీగా దొంగ బిల్లులు పెట్టారు. దీనిపై నేను విచారణకు డిమాండ్ చేస్తున్నా.

నాడు జగన్ మీదనే కేసు పెట్టిన వంశీ.. ఆయనకే నేడు జగన్ వత్తాసు

మినుము పంటను తొక్కుకుంటూ వెళ్లాడని జగన్ మీదనే వంశీ కేసు పెట్టాడు. అదే వంశీ అరెస్టు అక్రమం అంటూ జగన్ ట్వీట్లు చేస్తున్నాడు. కొడాలి నాని వంటి వాళ్ల ట్వీట్లతో కూతలు కూస్తున్నారు. నేనొక్కటే చెబుతున్నా.. మగాడిలా బయటకు వచ్చి మాట్లాడమంటున్నా. వంశీని నేనెప్పుడూ రాజకీయ ప్రత్యర్థిగానే చూశా. ఆయన నన్ను శత్రువుగానే చూశాడు. ఇప్పుడు కూడా వంశీ చేసిన నిర్వాకాల వల్లనే ఆయన అరెస్టు అయ్యాడు తప్పితే మేమేదో కావాలని చేయించింది కాదు.

నియోజకవర్గాన్ని గాడిలో పెడుతున్నా

నియోజకవర్గాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నా. మల్లవల్లిలో కొత్తగా పరిశ్రమలు తీసుకు వచ్చి స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నా. అతి త్వరలో సాకారం అవుతుంది. జాబ్ మేళాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తున్నా. మేథ దగ్గర ఐటీ గచ్చిబౌలిని తీసుకురావాలని ప్రయత్నం చేశా. 30 ఎకరాల భూమి అవసరమైంది. తీరా చూస్తే భూములు కొన్ని ఆక్రమణలలో ఉన్నాయని తేలింది. ఐబీఎస్ వంటి కళాశాలలను తీసుకురావాలన్నది నా ఉద్దేశ్యం. హెచ్‌సీఎల్ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ తీసుకు వచ్చి గన్నవరం అభివృద్ధికి గతంలో కృషి చెయ్యలేదు. నేను ఆ పని చేస్తున్నా. గతంలో నేను కేడీసీసీ బ్యాంకును ఏ విధంగా అభివృద్ధి చేశానో.. అదే తరహాలో గన్నవరం నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేసి మోడల్‌గా నిలపాలన్నది నా ఆలోచన.



ఆర్టీసీ సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ పెద్దిరాజు

కుంభమేళాకు ఆర్టీసీ బస్సులు

మచిలీపట్నం టౌన్ : ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు మచిలీపట్నం నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు. ఆదివారం డిపో మేనేజర్ టి.పెద్దిరాజు జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే ఈ యాత్రలో యాత్రికులకు కొన్ని యాత్రా స్థలాలు చూపిస్తారన్నారు. వంట మనిషిని కూడా ఏర్పాటు చేశామన్నారు.

డాక్టర్ సరితకు డయాబెటిస్ ఇండియా ఫెలోషిప్ అవార్డు

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మధుమేహవ్యాధిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ నివారణకు విశేష కృషి చేస్తున్న విజయవాడకు చెందిన ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణురాలు డాక్టర్ సరిత కాకానికు డయాబెటిస్ ఇండియా సంస్థ ప్రతిష్ఠాత్మక డయాబెటిస్ ఇండియా ఫెలోషిప్ అవార్డు దక్కింది. మధుమేహంపై గత 15ఏళ్లుగా పరిశోధన, అనేక అవగాహన కార్యక్రమాలను ఆమె నిర్వహిస్తున్నారు. అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ డయాబెటిస్‌లో సరిత ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పీటర్ ష్వార్జ్ నుంచి అవార్డును అందుకున్నారు.

ఏపీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా బేబీరాణి

గాంధీనగర్ : ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా వేముల బేబీరాణి, రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో, ఉద్యోగ, రాజకీయాల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బత్తుల నాగేశ్వరరావు, షేక్ సయ్యద్, మైలవరపు శేషు, వేముల శివ, మహమ్మద్ సలీం, షేక్ మున్నీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడిగా జాన్సన్

మచిలీపట్నం టౌన్ : ఉమ్మడి కృష్ణాజిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షుడిగా ఎం.జాన్సన్ ఎన్నికయ్యారు. ఆదివారం ట్రెజరీ కార్యాలయం వద్ద జరిగిన ఎన్నికలకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమణారెడ్డి పరిశీలకునిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడుగా ఎం.జాన్సన్, సహాధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా దీపక్, ఆర్థిక కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా బి.నాగేంద్రం, సురేష్, రమాదేవి, సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా గోపాల్‌సింగ్, రాధిక, వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ, ఖజానాశాఖలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

ఎడ్లబండిని ఢీకొని ఆర్టీసీ కండక్టర్ దుర్మరణం



తోట్లవల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎడ్లబండిని వెనుక నుంచి ద్విచక్రవాహనంతో ఢీకొని ఆర్టీసీ కండక్టర్ చీకుర్తి సురేష్(42) దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి తోట్లవల్లూరు రోడ్డులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తోట్లవల్లూరు దళితవాడకు చెందిన సురేష్ ఉయ్యూరు డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి డ్యూటీ దిగి స్కూటీపై ఇంటికి వస్తున్నాడు. అలాగే తోట్లవల్లూరుకు చెందిన కిలారపు శివప్రసాద్ ఎడ్లబండి ఉయ్యూరు కేసీపీ ఫ్యాక్టరీకి చెరకు తోలి తిరిగి వస్తోంది. యాకమూరు రైస్‌మిల్లు దాటిన తరువాత సురేష్ ఎడ్లబండిని వెనుక నుంచి ఢీకొట్టి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ వై.చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సురేష్‌కి భార్య మహారాణి, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

ఆదరణ పథకం పునరుద్ధరణ బీసీలకు వరం: జనసేన నేత గణేశ్

పెనమలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చ జెండా ఊపడం రాష్ట్రంలోని బీసీలకు వరంగా మారుతుందని జనసేన తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు తాతపూడి గణేష్ పేర్కొన్నారు. ఆదివారం కానూరు జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, కులవృత్తికి ఆధునికతను జోడించి పని సులభతరం చేయడంతో పాటు ఆదాయాన్ని పెంచేట్లు కొత్త పరికరాలను అందించాలని నిర్ణయించి అధికారులను ఆదేశించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపిక చేసిన లబ్దిదారులు వాటిని ఖచ్చితంగా ఉపయోగించేలా, ఆదాయాలను పెంచుకొనేలా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని గణేష్ స్పష్టం చేశారు.

పూల తోటలకు వైరస్!

- ఎండిపోతున్న బంతి,చామంతి మొక్కలు
- రూ. లక్షల్లో పెట్టుబడి
- దిగాలు పడుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


వైరస్ సోకి ఎండిపోయిన చామంతి మొక్కలు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

హేమంత రుతువులో విరగపూసి రైతులకు సిరులు కురిపించే చామంతి, బంతి పూల తోటలకు వైరస్ ఆశించి ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయ్యప్ప స్వామి దీక్ష, సంక్రాంతి పండుగలకు చామంతి, బంతిపూలకు మంచి డిమాండ్ ఉంటుంది. సాధారణంగా ఈ సీజన్‌లో పూతోటలు బాగా పూసి పండించిన రైతులకు సిరులు కురిపిస్తాయి. కాని ఈ ఏడాది వైరస్‌తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకునూరు, పెదఓగిరాల, తోట్లవల్లూరు మండల పరిధిలో రైతులు చామంతి, బంతిపూల తోటలు సాగు చేస్తుంటారు. ఈ సీజన్‌లో చామంతి, బంతిపూల తోటలకు వైరస్ సోకడంతో పూలు పూస్తూ ఎండి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎకరా రూ. 50 వేలకు కౌలుకు తీసుకుని గండిగుంట, చినఓగిరాలలో రైతులు పూతోటలు వేసి లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టారు. అయ్యప్ప దీక్షలు, సంక్రాంతి పండుగ సమయంలో తోటలు వైరస్ సోకి ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితులు నెలకొన్నాయి. పూతోటలపై పెట్టిన పెట్టుబడి కూడా రాదని కౌలు ఎలా కట్టాలో తెలియక రైతులు కొట్టుమి ట్టాడుతున్నారు. మంచుపడుతున్న తరుణంలో కనీసం మహాశివరాత్రి సమయం నాటికి మొక్కలు వైరస్ నుంచి బయటపడి పూస్తాయని భావించి రైతులు పెద్ద ఎత్తున రసాయనక మందులు స్ప్రే చేశారు. అయినా నానాటికి మొక్కలు ఎండిపోతున్నాయి. పూల తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయాం



ఎకరం పొలం కౌలుకు తీసుకుని చామంతి, బంతి పూల తోటలు సాగు చేశాము. పంట చేతి కొచ్చే సమయంలో వైరస్ సోకి మొక్కలు ఎండిపోయా యి. కష్టపడి పెంచిన తోట వైరస్‌తో కళ్లముందే ఎండిపోయింది. పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోయాము.

\- తాతినేని శివపార్వతి

క్యాబేజీ విక్రయానికి రైతుబజార్లలో స్టాల్స్

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ్ సునీత


చినఓగిరాలలో క్యాబేజీ పంటను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ్ సునీత, ఇతర అధికారులు

ఉయ్యూరు. ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన క్యాబేజీకి తగిన ధర కల్పించేందుకు రైతుబజార్లలో స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ్ సునీత అన్నారు. చినఓగిరాలలో అత్యధిక స్థాయిలో సాగు చేసిన క్యాబేజీ కొనేవారు కరువై గిట్టుబాటు ధర రాని పరిస్థితుల్లో కోసి మార్కెట్‌కు తరలించినా కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా రాక ఇబ్బందులు పడుతున్న వైనాన్ని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా మార్కెటింగ్, ఉద్యాన శాఖల అధికారులతో కలసి కమిషనర్ ఆదివారం చినఓగిరాలలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా క్యాబేజీ సాగుచేసిన పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పంట సాగుచేస్తే మార్కెట్‌లో ధర తగ్గిపోయిందని, మార్కెట్, రైతు బజార్లకు ఇతర ప్రాంతాలనుంచి క్యాబేజీ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాబేజీ దిగుమతులు నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని కమిషనర్ రైతులకు హామీఇచ్చారు. మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాసారావు, సహాయ సంచాలకులు నిత్యానందం, ఉప సంచాలకులు దివాకర్ క్యాబేజీ రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. దోనేపూడి శివాజీ, మాధవ, అశోక్ తదితర రైతులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ప్రచారం చేస్తున్న ప్రొఫెసర్, టీడీపీ నాయకులు రావి సురేష్‌బాబు

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలి

కంకిపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ప్రొఫెసర్, టీడీపీ నాయ కులు రావి సురేష్‌బాబు అన్నారు. అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తుందన్నారు. 76 ఏళ్ల వయస్సులోనూ రాష్ట్ర ముఖ్యమంత్రి సమావేశాలు, సమీక్షలు అంటూ అధికార యంత్రాగాన్ని పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు కూటమి ప్రభుత్వ పాలనకు మెమొరాండం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా కృషి చేస్తున్నారని కొనియా డారు. ఈ కార్యక్రమంలో షేక్ సలీం, షేక్ మోహిద్దీన్, షేక్ సుబాన్ వలి, ఉడత నాగేశ్వరరావు, చైతన్య పాల్గొన్నారు.

బాపులపాడులో ఇంటింటా ప్రచారం

హనుమాన్‌జంక్షన్ : పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ తెలుగు మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి మహిళా పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాపులపాడులోని పలువురు ఉపాధ్యాయులను, పట్టభద్రుల మహిళ ఓటర్లను ఇంటింటా కలసి బొట్టుపెట్టి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కల్యాణి వెంట టీడీపీ కార్యకర్తలు పొట్లూరి వెంకటసుధీర్, కవులూరి సాయి, మహిళా కార్యకర్తలు నాగమణి, షీబా తదితరులు ఉన్నారు.


బాపులపాడులో ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ సాయికల్యాణి ప్రచారం


ఉయ్యూరు బస్టాండ్ ఆవరణలో మూడో రోజు దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అధికారులు స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ రాజేశ్‌కుమార్

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్యాలయ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఉయ్యూరు డిపోలో జరిగిన చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ రాజేశ్‌కుమార్ హెచ్చరించారు. సర్క్యులర్‌కు భిన్నంగా, ఏకపక్షంగా నిర్వహించిన చార్ట్ కౌన్సెలింగ్ విధానానికి వ్యతిరేకంగా స్థానిక డిపో అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన రిలేదీక్ష ఆదివారం మూడోరోజు కొనసాగింది. దీక్షను ప్రారంభించిన రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్ర కార్యాలయ సర్క్యులర్‌కు వ్యతిరేకంగా జరిగిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దుచేసి తిరిగి కౌన్సెలింగ్ చేపట్టాలని డిపో ఉద్యోగులు కొన్నిరోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపి, మూడురోజులుగా రిలేదీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోపోవడం బాధాకరమన్నారు. ఎల్ఎస్ రావు, జీఎస్ రావు దీక్షలో పాల్గొనగా ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ రామకృష్ణ, కోశాధికారి అజయ్, జాయింట్ సెక్రటరీ సురేశ్‌కుమార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. డిపో కార్యదర్శి పి మురళీకృష్ణ, జిల్లా నాయకులు, మచిలీపట్నం డిపో నాయకులు హాజరై ఉద్యమానికి మద్దతు పలికారు.


ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ శారమ్మ, వైద్య సిబ్బంది

స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ

గన్నవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత మన ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారమ్మ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అందరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో అందరు భాగస్వాములు కావాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపిక రేపు

ఉంగుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఉంగుటూరు మండలం పెద అవుటపల్లి హైవే క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణాజిల్లా మహిళ, పురుషుల జట్లు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి డీఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. తిరుపతిలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే అంతర్‌జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలకు పంపటం జరుగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి వేడుకల నేపథ్యంలో యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ సాయినగర్ ఫీడరు పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరపఫరా నిలుపుదల చేస్తున్నట్టు గుణదల డివిజన్ ఈఈ హరిబాబు తెలిపారు. ఉదయం 7.30 నుంచి 12 గంటలవరకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. సాయినగర్, పుట్టరోడ్డు, మాదు తిరుపతి రావునగర్ టవర్ రోడ్డు, శివపార్వతి నగర్ ఏరియా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


ప్రసాదం పంపిణీ చేస్తున్న పద్మశాలీ సేవా సంఘం నాయకులు

ప్రసాదం పంపిణీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు పద్మశాలీయ సేవా, సంక్షేమ సంఘం ఉయ్యూరు ఆధ్వర్యంలో ఆదివారం పది వేల మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి వీరమ్మతల్లిని తిరునాళ్లలో దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడం మహాభాగ్యంగా భావిస్తున్నామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎస్ మూర్తి, తుమ్మలచర్ల శ్రీధర్, కోశాధికారి గొట్టుముక్కల సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఉపాధ్యక్షుడు ఎన్ వెంకటప్రసాద్, సుబ్బారాయుడు, దిలీప్, శ్రీకాంత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని సేవలందించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుపై

రైతుల అభ్యంతరం

- సంతకాలు సేకరించి కలెక్టర్‌కు వినతి


కూచిపూడి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోసూరు రోడ్డులో దశాబ్దాల తరబడి రైతులకు సేవలందిస్తున్న మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గూడపాడు రోడ్డులోకి మార్చడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, మరో 50 మంది రైతులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ డీకే బాలాజీకి ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఆ నకళ్లను స్థానిక విలేకరులకు అందజేశారు. మండవ కోటేశ్వరరావు, మండవ ఫణి, పోతార్లంక రెడ్డయ్య, గోపి, శ్రీనివాసరావు, చినవెంకటేశ్వరరావుతోపాటు మరో 50 మంది రైతులకు సంతకాలు చేసి కలెక్టర్‌కు వినతిపత్రం పంపారు.

నేరాలకు పాల్పడితే

కఠిన చర్యలు

- రౌడీషీటర్లకు ఎస్సై శ్రీనివాస్ కౌన్సెలింగ్

నందివాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సత్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లను ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. గ్రామాల్లో చిల్లర దొంగతనాలు, బైక్‌లు, మోటార్ల చోరీలు, చేపల చెరువుపై దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లను ఎస్సై స్టేషన్ వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చేపల చెరువులపై మోటార్లు, మేత కట్టల దొంగతనాలు జరుగుతున్నాయని, ఎవరైనా కొత్తవారు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే తెలియజేయాలని ఆయన సూచించారు.


ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

కొండాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ ఈవో ఎ.కొండలరావు తెలిపారు. శని, ఆదివారాల్లో వివాహ శుభముహర్తాలు ఎక్కువ ఉండడంతో ఆదివారం ఉదయం పదుల సంఖ్యలో నవ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆయన పేర్కొన్నారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు

వీరమ్మతల్లిని దర్శించుకున్న ప్రముఖులు


ప్రత్యేక పూజలో జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు ఆదివారం తిరునాళ్లలో వీరమ్మతల్లిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తిరునాళ్లలో ఏర్పాట్లు, బందోబస్తు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

ఉచిత మెగా వైద్యశిబిరం

గుడివాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో లక్ష్మీ పెరుమాళ్లు, ప్రభావతి దంపతులు, రాయన్ చౌదరి జ్ఞాపకార్థం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ రాజశేఖర్ ప్రారంభించారు. వైద్యులు శ్రీహరి, రామకృష్ణ, ఎస్కే కరీం, మదనిక వైద్య సేవలందించారు. క్లబ్ కార్యదర్శి కిరణ్ బాబు, కోశాధికారి నరహరిశెట్టి ప్రసాద్, పూర్వ అధ్యక్షులు పి.సూర్యచంద్రరావు, పి.రామకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, ఎం.రమణమూర్తి, సభ్యులు మహదేవ దేశాయ్, వైద్య కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుపై
రైతుల అభ్యంతరం

● సంతకాలు సేకరించి కలెక్టర్‌కు వినతి

కూచిపూడి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోసూరు రోడ్డులో దశాబ్దాల తరబడి రైతులకు సేవలందిస్తున్న మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గూడపాడు రోడ్డులోకి మార్చడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై గ్రామ రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, మరో 50 మంది రైతులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ డీకే బాలాజీకి ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఆ నకళ్లను స్థానిక విలేకరులకు అందజేశారు. మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలకు సేవలు విస్తరించాయని, ఈ కార్యాలయం ప్రస్తుతం ఉన్న ప్రదేశం రైతులకు, డాక్యుమెంట్ రైటర్లకు అందుబాటులో ఉందని, గూడపాడు రోడ్డులోని పురాతన భవనానికి మార్చాల్సిన అవసరం లేదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. విలువైన దస్తావేజులు, డాక్యుమెంట్లు భద్రపరచడానికి గూడపాడు రోడ్డులోని పురాతన కార్యాలయం అనుకూలంగా లేదని ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రస్తుతం ఉన్న కార్యాలయాన్ని కొనసాగించాలని కోరారు. మండవ కోటేశ్వరరావు, మండవ ఫణి, పోతార్లంక రెడ్డయ్య, గోపి, శ్రీనివాసరావు, చినవెంకటేశ్వరరావుతోపాటు మరో 50 మంది రైతులకు సంతకాలు చేసి కలెక్టర్‌కు వినతిపత్రం పంపారు.

నేరాలకు పాల్పడితే
కఠిన చర్యలు

● రౌడీషీటర్లకు ఎస్సై శ్రీనివాస్ కౌన్సెలింగ్

నందివాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సత్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లను ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. గ్రామాల్లో చిల్లర దొంగతనాలు, బైక్‌లు, మోటార్ల చోరీలు, చేపల చెరువుపై దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లను ఎస్సై స్టేషన్ వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చేపల చెరువులపై మోటార్లు, మేత కట్టల దొంగతనాలు జరుగుతున్నాయని, ఎవరైనా కొత్తవారు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే తెలియజేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్తవారు కనిపిస్తే వారి ప్రవర్తనపై అనుమానం ఉంటే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపిక రేపు

ఉంగుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఉంగుటూరు మండలం పెద అవుటపల్లి హైవే క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణాజిల్లా మహిళ, పురుషుల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి డీఎన్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. తిరుపతిలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే అంతర్‌జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలకు పంపుతామని తెలిపారు.

గురుకుల పాఠశాలలో
ప్రవేశానికి దరఖాస్తులు

మోపిదేవి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి తెలిపారు. మోపిదేవి, మైలవరం బాలురు, మచిలీపట్నం బాలికల పాఠశాలల్లో సీట్ల భర్తీకి మార్చి నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నాగాయలంక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు. సంగమేశ్వరంలో మూడు, కమ్మనమోలులో రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, తదుపరి చర్యలకు మండల రెవెన్యూ అధికారి వద్దకి పంపామని ఎస్సై తెలిపారు.

పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం
మరిన్ని పుస్తకాల కొనుగోలు

● గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేస్తామని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠకులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అల్పాహారం అందజేయాలని, నెట్ స్పీడ్ పెంచాలని, ట్యూబ్‌లైట్లు మరిన్ని వేయాలని, కొత్త గ్రంథాలు కొనుగోలు చేయాలని చైర్మన్‌ను పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కోరారు. గ్రూప్-2 పరీక్షలకు హాజరవుతున్న నిరుద్యోగ యువతీ యువకులతో కోటేశ్వరరావు మాట్లాడారు. కోటేశ్వరరావును జిల్లా గ్రంథాలయ అధికారులు ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు పీవీ ఫణికుమార్, ఉప్పలపాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

● సిడ్నీ మీట్ అండ్ గ్రీట్‌లో ఎన్నారైలకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపు



సిడ్నీలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, విశ్రమ దంపతులు

పామర్రు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం, గ్రామీణ పేదరిక నిర్మూలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయన ఆశయసాధనలో ఆస్ట్రేలియాలో స్థిరపడిన భారతీయులు కూడా భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారి ఆయన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. ఆదివారం సిడ్నీలోని టీడీపీ కార్యాలయంలో ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో తన భార్య విశ్రమతో కలిసి ఆయన పాల్గొన్నారు. పేదరికంలేని గ్రామాల కోసం చంద్రబాబు ఆలోచన నుంచి పుట్టిన పీ4-విధానం విజయవంతానికి ప్రవాస భారతీయులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా తన విజయం కోసం శ్రమించిన టీడీపీ ఆస్ట్రేలియా మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఈనెల 27 జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయం అందించాలని ఆస్ట్రేలియా నుంచి పామర్రు నియోజకవర్గంలోని పట్టభద్రులకు ఫోన్లు చేసి కుమార్‌రాజా ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారి ఆస్ట్రేలియాకు విచ్చేసిన కుమార్‌రాజా, విశ్రమ దంపతులను ఎన్నారైలు ఘనంగా సత్కరించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు, ప్రసంగిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బసీ సెక్రటరీ జీవీ రామచంద్రరావు

సందడిగా ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్
పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లమో పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వస్తే వదులుకోవద్దని, మంచి అనుభవంతోపాటు ఆదాయమూ కూడా లభిస్తుందని కుటుంబ నేపథ్యాన్ని గుర్తెరిగి ఉన్నత విద్యపై దృష్టి సారించాలని రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బసీ సెక్రటరీ జీవీ రామచంద్రరావు సూచించారు. శనివారం రాత్రి గుడ్లవల్లేరులో నిర్వహించిన ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల 44వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా పాలిటెక్నిక్ పూర్వవిద్యార్థి ఎన్ఐటీ వరంగల్ ఈసీఈ ప్రొఫెసర్, ఎలక్ట్రానిక్స్ సీబీటీ అకాడమీ చీఫ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి.శ్రీహరి పాల్గొన్నారు. పాలిటెక్నిక్ టాపర్స్ బ్రాంచ్ టాపర్స్‌కు బంగారు పతకాలు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, సబ్జెక్టు వారీగా విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడానికి పాఠాలు చెప్పిన అధ్యాపకులకు నగదు పురస్కారాలు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. ప్రత్యేక అతిథి ఎన్ఎస్ఎఫ్ విజయవాడ చాప్టర్ చైర్మన్ సూరపనేని వెంకటరత్నం, కళాశాల ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్, సంస్థ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఉత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థిని ఆలూరి లలితకోమలి, ఉత్తమ అవుట్‌గోయింగ్ స్పోర్ట్స్‌మెన్ భూక్యా జయకుమార్, ఎస్ఆర్‌జీఈసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, హైస్కూల్ డైరెక్టర్ నారాయం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



పామర్రులో ప్రచారం చేస్తున్న కూటమి మహిళా నాయకులు

ఆలపాటిని గెలిపించండి

పామర్రు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం, గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసంకూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు విజయం చేకూర్చాలని పట్టభద్ర ఓటర్లను కూటమి నాయకులు కోరారు. ఆలపాటి విజయాన్ని కోరుతూ కూటమి పార్టీల మహిళా నేతలు పామర్రు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందని, సమస్యల పరిష్కారం ఆయనతోనే సాధ్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్రియాశీలక మహిళా నేత ఆరుమళ్ల అనితారెడ్డి, పువ్వాడ ఉషారాణి, ఆరుమళ్ల రాజారెడ్డి, చాట్ల పున్నమ్మ పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో బొడ్డపాడులో శ్రీకాకుళపు అంజిబాబు(45) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్న సమయంలో ఇంటిలో చీరతో ఉరివేసుకుని మృతిచెందినట్టు ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. భార్య వెంకటేశ్వరమ్మ, అంజిబాబు గొడవ పడుతుండేవారని, దీంతో అంజిబాబు ఉరివేసుకున్నాడని ఎస్సై తెలిపారు. అంజిబాబుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య వెంకటేశ్వరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కొండాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ ఈవో ఎ.కొండలరావు తెలిపారు. శని, ఆదివారాల్లో వివాహ శుభముహూర్తాలు ఎక్కువ ఉండడంతో ఆదివారం ఉదయం పదుల సంఖ్యలో నవ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆయన పేర్కొన్నారు. భక్తులు అమ్మవారికి పాలపొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



కొండాలమ్మ ఆలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం అంటూ మోటూరులో వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. ఆదివారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మోటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ దీప్తి, వైద్య సిబ్బంది

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో మంత్రి సుభాష్



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మోపిదేవి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆదివారం సందర్శించారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలను వారికి అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు బొబ్బా గోవర్ధన్, మండలి వెంకట్రామ్, ఎంపీపీ రావి దుర్గావాణి, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాంస్య పతక విజేతలకు అభినందన

గుడివాడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 9వ తేదీన నిర్వహించిన కరాటే రాష్ట్ర పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు రెండు కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. 14 సంవత్సరాల లోపు బాలుర వ్యక్తిగత కుమితే విభాగంలో టి.హేమంత్, 11 సంవత్సరాల లోపు బాలుర వ్యక్తిగత కటా విభాగంలో కె.వేద్రశ్రీ నాగేంద్రకుమార్‌లు తృతీయ స్థానం సాధించారని ఆయన తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులు, కోచ్ ఎస్.వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.



హేమంత్, వేద్రశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం శ్రీలక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి హోమంలో 120 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు పూజా కార్యక్రమాలు ముగిశాక హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు(వాసు), దేవదాయ శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిని సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వీరమ్మను దర్శించుకున్న ప్రముఖులు



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎస్పీ గంగాధర్‌రావు

ఉయ్యూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు ఆదివారం తిరునాళ్లలో వీరమ్మతల్లిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్లలో ఏర్పాట్లు, బందోబస్తు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు.



పర్యాటకులు రాక వెలవెలబోతున్న హంసలదీవి బీచ్

హంసలదీవి బీచ్ వెలవెల

● టోల్ రుసుం వసూలే కారణమంటున్న స్థానికులు

కోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సందర్శకుల రాక తగ్గి హంసలదీవి బీచ్ వెలవెలబోతోంది. బీచ్ వద్ద సరైన సదుపాయాలు ఏర్పాటు చేయకుండా టోల్‌గేట్ వసూలు చేయడంతో సందర్శకుల రాక రోజురోజుకూ తగ్గిపోతోందని స్థానికులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10, టూ వీలర్‌కు రూ.20, ఫోర్ వీలర్‌కు రూ.40, హెవీ వెహికల్స్‌కు రూ.100 టోల్‌గేట్ వసూలు చేయటంతో ఈ టోల్ భారాన్ని కట్టలేక ఒక్కసారి వచ్చిన పర్యాటకులు మరలా తిరిగి రావటం లేదని గ్రామస్థులు తెలిపారు. మండల సమీప ప్రాంతాల్లోని ప్రజలు ఆదివారం, పండుగల సమయంలో కుటుంబ సమేతంగా సరదాగా గడిపేందుకు బీచ్ వద్దకు గతంలో విచ్చేసేవారు. ప్రస్తుతం టోల్‌గేట్ వసూలు చేయటంతో స్థానికులు కూడా రావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి టోల్‌గేట్ రుసుం వసూలు నిలిపివేయాలని సందర్శకులు కోరుతున్నారు.



చిన ఓగిరాలలో క్యాబేజీ పంటను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ్ సునీత, ఇతర అధికారులు

క్యాబేజీ విక్రయానికి రైతుబజార్లలో స్టాల్స్

● మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ్ సునీత

ఉయ్యూరు. ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన క్యాబేజీకి తగిన ధర కల్పించేందుకు రైతుబజార్లలో స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించేలా చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ్ సునీత అన్నారు. చిన ఓగిరాలలో అత్యధిక స్థాయిలో సాగు చేసిన క్యాబేజీ కొనేవారు కరువై గిట్టుబాటు ధర రాని పరిస్థితుల్లో కోసి మార్కెట్‌కు తరలించినా కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా రాక ఇబ్బందులు పడుతున్న వైనాన్ని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా మార్కెటింగ్, ఉద్యాన శాఖల అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం చిన ఓగిరాలలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్యాబేజీ సాగుచేసిన పొలాలను సందర్శించారు. పంట పరిస్థితిని పరిశీలించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పంట సాగుచేస్తే మార్కెట్‌లో ధర తగ్గిపోయిందని, మార్కెట్, రైతు బజార్లకు ఇతర ప్రాంతాలనుంచి క్యాబేజీ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాబేజీ దిగుమతులు నిలిపివేసేలా చర్యలుచేపట్టాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని కమిషనర్ రైతులకు హామీ ఇచ్చారు. క్యాబేజీ రైతులతో మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు నిత్యానందం, ఉప సంచాలకుడు దివాకర్ మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. క్యాబేజీ పండించే రైతులు దోనేపూడి శివాజీ, మాధవ, అశోక్ తదితరులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.450



నూకాలమ్మకు మంత్రి రవీంద్ర పూజలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి నూకాలమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొండపల్లి రవి, కొండపల్లి బాలాజీ, చిలంకుర్తి నెహ్రూ, సీతారామయ్య, గణేష్ తదితరులు ఘనస్వాగతం పలికారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో మంత్రి సుభాష్

మోపిదేవి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆదివారం సందర్శించారు. నాగపుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు వారికి అందజేశారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, కూటమి నాయకులు బొబ్బా గోవర్ధన్, మండలి వెంకట్రామ్, ఎంపీపీ రావి దుర్గావాణి, మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మోపిదేవి ఆలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ



అవనిగడ్డలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి సుభాష్



పెడనలో ప్రచారం చేస్తున్న వేణుగోపాలరావు, రఘురామరాజు



కె.కొత్తపాలెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న మండలి వెంకట్రామ్

ఆలపాటికి మెజార్టీ సాధనే లక్ష్యం

● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్

అవనిగడ్డ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధనే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద కూటమి నేతలు, సీనియర్ కార్యకర్తలతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మంత్రి సుభాష్ సమీక్ష నిర్వహించారు. కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవన్నారు. మెగా డీఎస్సీ వేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఈ విషయాలను వివరించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని మంత్రి పార్టీ శ్రేణులకు సూచించారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సేవానిరతి ఉన్న గొప్ప నేత అని, ఆయన గెలుపు కోసం మూడు పార్టీల నేతలు సమన్వయంతో పని చేయాలని ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. నియోజకవర్గ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి గెలుపు ఇప్పటికే ఖరారయిందన్నారు. నేతలు బొబ్బా గోవర్ధన్, తలశిల స్వర్ణలత, కొల్లూరి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, యాసం చిట్టిబాబు, మోర్ల రాంబాబు, మెండు లక్ష్మణరావు, నడకుదుటి జనార్ధనరావు, తుంగల కోటేశ్వరరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, రావి దుర్గావాణి, బండే కనకదుర్గ, రావి రత్నగిరి, మేడికొండ విజయ్, బీజేపీ నేత శోభిల ఏడుకొండలు, వీర మహిళ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం కోసం ప్రతి ఒక్కరూ సహకరించి ఓటు వేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. ఆదివారం అవనిగడ్డలో రాజేంద్ర ప్రసాద్ గెలుపుకోసం ఆయన కూటమి నేతలతో కలసి ప్రచారం నిర్వహించారు. **మోపిదేవి :** పట్టభద్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ విజ్ఞప్తి చేశారు. కె.కొత్తపాలెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు విచ్చేసి ఎమ్మెల్సీ ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు రావి రత్నగిరి, ఎంపీటీసీ కొమ్మ పవన్, టీడీపీ, జనసేన గ్రామ అధ్యక్షులు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, మత్తి వంశీ, నీటి సంఘం అధ్యక్షుడు మత్తి నాగమల్లేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **పెడన :** ఆలపాటిని గెలిపించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ ఎన్నిక పెడన నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు విజ్ఞప్తి చేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా పెడన పట్టణంలోని 13, 14 వార్డులలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, వాసా సాంబశివరావు, అనుముల పూర్ణ, సుబ్రహ్మణ్యం, ఎలిగట్ల ప్రసాద్, కొసనం భార్గవ్ పాల్గొన్నారు. **గూడూరు :** ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ విజయంతో గెలిపించాలని డీసీ చైర్మన్, మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి కోరారు. కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఓటరును కలసి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. దాసరి ఉమాసాయిరామ్, కోలపల్లి రజని, గోపీ నాగబాబు, కట్టా మునీశ్వరరావు, ఎస్‌పి బేగ్, బాసంశెట్టి శ్రీను, విజయ్, వాకా శ్రీనివాసరావు, బత్తిన రామకృష్ణ పాల్గొన్నారు.



భావదేవరపల్లిలో ప్రచారం

నాగాయలంక : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలంటూ భావదేవరపల్లిలో సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మాజీ ఎంపీటీసీ బొండాడ గణపతిరావు తదితరులు ఆదివారం పట్టభద్రుల ఇంటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

సీనియర్ నటి కృష్ణవేణి మృతికి మంత్రి రవీంద్ర సంతాపం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సినీనటి కృష్ణవేణి మృతికి మంత్రి కొల్లు రవీంద్ర సంతాపం తెలిపారు. బాలనటిగా రంగప్రవేశం చేసిన కృష్ణవేణి తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారన్నారు. మనదేశం చిత్రంలో తెలుగుతెరకు పరిచయమయ్యారన్నారు. ఎన్టీఆర్, ఎన్వీఆర్‌లతో ఆమె నటించారన్నారు.

పవన్ సేవా నిరతి అభినందనీయం : రాయపూడి

అవనిగడ్డ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ ట్రస్ట్ తలసీమియా వ్యాధి గ్రస్తులకు నిర్వహించతలపెట్టిన కార్యక్రమాల కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రూ.50 లక్షలవిరాళం ఇవ్వటం అభినందనీయమని జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని, దాతల్లో స్ఫూర్తి నింపేలా పవన్ కల్యాణ్ వేసిన అడుగు బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యసహాయం అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

బచ్చు మాధవరావుకు పాపారావు నివాళి

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మోదుమూడి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు బచ్చు శ్రీహరి తండ్రి బచ్చు మాధవరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు పాల్గొన్నారు. మాధవరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బచ్చు వెంకటనాథ్, గుడివాక శివరావు, కొండవీటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, బాదర్ల లోలాక్షుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత ఉదయభాస్కర్‌కు వెంకట్రామ్ పరామర్శ

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పితృవియోగానికి గురైన జనసేన పార్టీ పులిగడ్డ గ్రామ అధ్యక్షుడు మండలి ఉదయభాస్కర్‌ను జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ ఆదివారం పరామర్శించారు. శివాజీ బాబు మృతికి సంతాపం, కుటుంబసభ్యులను సానుభూతిని తెలియజేశారు. జనసేన మండల ప్రధాన కార్యదర్శి మండలి శివప్రసాద్, మండలి శేషు, జనసైనికులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

మోపిదేవి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి తెలిపారు. మోపిదేవి, మైలవరం బాలురు, మచిలీపట్నం బాలికల పాఠశాలల్లో సీట్ల భర్తీకి మార్చి నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నాగాయలంక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు. సంగమేశ్వరంలో మూడు ట్రాక్టర్లను, కమ్మనమోలులో రెండు ట్రాక్టర్లను పట్టుకుని తదుపరి చర్యలు నిమిత్తం మండల రెవెన్యూ అధికారి వద్దకి



ఆత్మీయ సమ్మేళనంలో ఘంటసాల జడ్పీ ఉన్నత పాఠశాల 1970-80 బ్యాచ్ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో రుస్తుంబాద హైస్కూల్ 1984 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

ఎన్నెన్నో జ్ఞాపకాలు..

ఘంటసాల జడ్పీ, రుస్తుంబాద పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఘంటసాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల మహాత్మాగాంధీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1970-80 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. పూర్వ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. వివిధ స్థాయిల్లో స్థిరపడిన వారు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుని, గత స్మృతులను నెమరువేసుకున్నారు. విద్య నేర్పిన గురువులు వేములపల్లి బాబు రాజేంద్రప్రసాద్, వడ్లమడుగు వెంకట కృష్ణారావు, వేమూరి విశ్వేశ్వరరావు, దోనేపూడి వెంకటరత్నంలను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పోతన వెంకటేశ్వరరావు నేతృత్వం వహించారు.

రుస్తుంబాద ఉన్నత పాఠశాలలో..

మచిలీపట్నం టౌన్ : రుస్తుంబాద హైస్కూల్ 1984 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన సమ్మేళనంలో తమ గురువులు ముత్తేవి వెంకట శ్రీరామచంద్రమూర్తి, సువర్చలాదేవి, బత్తిన రత్నకుమారి, వేమూరి మైథిలిలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థి చిట్టా ఆంజనేయశాస్త్రి అధ్యక్షత వహించిన సమ్మేళనంలో జొన్నలగడ్డ విజయకుమార్, ఉదయగిరి సురేష్, పి.శాంతారామ్, రామలక్ష్మి తదితరులు మాట్లాడారు. కో ఆర్డినేటర్ విజయకుమార్ మాట్లాడుతూ, కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసుకుని పేద విద్యార్థులకు సాయం అందిస్తామన్నారు. 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు స్థలాలు, ఇళ్లు ఇస్తాం : మంత్రి రవీంద్ర



సంఘనేత యూసుఫ్ అలీ, నసీంబేగ్‌లను సత్కరిస్తున్న మంత్రి రవీంద్ర, రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన మెకానిక్‌లకు స్థలాలు, ఇళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నం వీరరాఘవయ్య కల్యాణ మంటపంలో జరిగింది. మంత్రి రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మెకానిక్‌ల అసోసియేషన్ సీనియర్ నాయకుడు యూసుఫ్ అలీ, నసీంబేగ్‌లను ఘనంగా సత్కరించారు. టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సంఘ కార్యాలయానికి వెయ్యి అడుగుల స్థలం కేటాయిస్తామన్నారు. మెకానిక్‌లకు ఏడాది బీమా ప్రీమియం తన సొంత సొమ్ముతో కడతానన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, మెకానిక్‌లు తమ పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మెకానిక్‌ల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సంఘం అధ్యక్షుడు కొల్లా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, మెకానిక్‌లకు సబ్సిడీలపై రుణాలివ్వాలన్నారు. ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, సీనియర్ టీడీపీ నాయకులు పిప్పళ్ళ కాంతారావు, జనసేన నాయకులు గడ్డం రాజు, మాదివాడ రాము, పినిశెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పరిషత్ చైర్మన్ బందరు గ్రంథాలయం తనిఖీ



పాఠకులతో మాట్లాడుతున్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయాన్ని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠకులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అల్పాహారం అందజేయాలని, నెట్ స్పీడ్ పెంచాలని, ట్యూబ్‌లైట్లు ఎక్కువ వేయాలని, కొత్త గ్రంథాలు కొనుగోలు చేయాలని కోరారు. గ్రూప్-2 పరీక్షలకు హాజరవుతున్న నిరుద్యోగ యువతీ యువకులతో కోటేశ్వరరావు మాట్లాడారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ, పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా టీడీపీ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్, టీడీపీ నాయకుడు ఉప్పలపాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోటేశ్వరరావును జిల్లా గ్రంథాలయ అధికారులు ఘనంగా సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు గోపీచంద్ సత్కారం



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న శానిటేషన్ వర్కర్ భోగిరెడ్డి నాంచారమ్మ, శానిటరీ వార్డు మేస్త్రీ భట్రాజు రామశేఖర్, సచివాలయ శానిటేషన్ సెక్రటరీ మాచవరపు మానసలను టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, డివిజన్ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్, కొనకళ్ల భాను సత్కరించారు. మచిలీపట్నం నగరాన్ని సుందర బందరుగా తీర్చిదిద్దేందుకు శానిటరీ వర్కర్లు చేస్తున్న కృషి అభినందనీయమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

పాగోలులో ప్రతిష్ఠా మహోత్సవాలు నేటి నుంచి



చల్లపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పాగోలులోని కైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిర ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కమలాత్మికా సహిత అచలేశ్వర మందిర ప్రతిష్ఠామహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ఆరు గంటలకు మంగళతోరణం, మంగళ వాయిద్యం, గోపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమాని కేదారశర్మ నేతృత్వంలో విద్యాసాగర్ స్వామి పర్యవేక్షణలో ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగనున్నాయి. ఏర్పాట్లను మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబులు పర్యవేక్షిస్తున్నారు.

టోల్ రుసుం వసూలుతో బీచ్‌లో తగ్గిన పర్యాటకులు



పర్యాటకులు రాక వెలవెలబోతున్న బీచ్

కోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి బీచ్ వద్దకు సందర్శకుల రాక తగ్గింది. బీచ్ వద్ద సరైన సదుపాయాలు ఏర్పాటు చేయకుండా టోల్‌గేట్ వసూలు చేయటంతో సందర్శకుల రాక రోజురోజుకూ తగ్గిపోతోందని స్థానికులు చెప్పారు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10, టూ వీలర్‌కు రూ.20, ఫోర్ వీలర్‌కు రూ.40, హెవీ వెహికల్స్‌కు రూ.100 అటవీశాఖ అధికారులు టోల్ రుసుం వసూలు చేయటంతో ఈ భారాన్ని కట్టలేక ఒక్కసారి వచ్చిన పర్యాటకులు మరలా తిరిగి రావటం లేదని గ్రామస్థులు చెప్పారు. మండల సమీప ప్రాంతాల్లోని ప్రజలు ఆదివారం, పండుగల సమయంలో కుటుంబ సమేతంగా సరదాగా గడిపేందుకు బీచ్ వద్దకు గతంలో వచ్చేవారు. ప్రస్తుతం టోల్ రుసుం వసూలు చేయటంతో స్థానికులు కూడా రావడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి టోల్‌గేట్ రుసుం వసూలు నిలిపివేయాలని సందర్శకులు కోరుతున్నారు.

వైభవంగా సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో సాక్షి రాంబాబు - నాగలక్ష్మి, కొక్కిలిగడ్డ సాంబశివరావు - కోటేశ్వరమ్మ దంపతులు, చెన్నగిరి ఉమేష్, వెంకట శేషగిరిరావు వైభవంగా కల్యాణం జరిపించారు. మాదివాడ మోహనరావు - రమాదేవి దంపతుల ఆర్థిక సహకారంతో అన్నదానం జరిగింది. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బందరులో పెదప్రోలు నాంచారమ్మ ఊరేగింపు



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో ఆదివారం పెదప్రోలు నాంచారమ్మ ఊరేగింపు జరిగింది. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి పెదప్రోలు తీసుకుని వెళ్లారు. ముచ్చింగుడి వద్ద అమ్మవారిని భక్తుల దర్శించుకున్నారు.

కోడిపందెపు రాయుళ్ల అరెస్టు

కోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కుమ్మరిపాలెం గ్రామంలో కోడిపందాల బరిపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్సై చాణిక్య సిబ్బందితో ఆకస్మిక దాడి చేసి, 10 మంది పందెపు రాయుళ్లను అరెస్టు చేసి 17 ద్విచక్ర వాహనాలు, రూ.13,980 నగదు, నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.